పెరుగుతున్న గోదావరితో కలవరం

కుక్కునూరు: క్రమంగా పెరుగుతున్న గోదావరి వరద కుక్కునూరు మండల వాసులను కలవరపెడుతుంది. గత నెలలో మూడవ ప్రమాద హెచ్చరిక వరకు వచ్చి తగ్గిన గోదావరి మళ్లీ ఇటీవల కురిసిన వర్షాలతో పెరుగుతోంది. దీంతో ఈసారి వరద ఏ మేరకు వస్తుందోనని ఇక్కడి ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మంగళవారం సాయంత్రానికి భద్రాచలం వద్ద మొదటిప్రమాద హెచ్చరికకు చేరువలో 39.6 అడుగులకు వరద ప్రవాహం చేరుకుంది. మరో నాలుగు అడుగులు పెరిగి 43 అడుగులకు వరద ప్రవాహం చేరితే అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేయనున్నారు. కాగా వరద తీవ్రత మొదటిప్రమాద హెచ్చరికకు చేరువలో ఉండడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. కుక్కునూరు తహసీల్దార్ వీవీ పెద్దిరాజు ముందస్తు జాగ్రత్తగా మండలంలోని గొమ్ముగూడెం, లచ్చిగూడెం గ్రామాలకు వెళ్లి ప్రజలను అప్రమత్తం చేశారు. గ్రామస్తులు పునరావాస సహాయక కేంద్రాలకు వెళ్లడానికి సిద్ధంగా ఉండాలని సూచించారు. కాగా గత గోదావరి వరదల్లో పంట నీట మునగడంతో వాటిని బతికించుకునేందుకు వివిధ రకాల మందులు చల్లి రైతులు నానాతంటాలు పడ్డారు. మళ్లీ గోదావరి వరద పెరుగుతుండడంతో ఈసారి వరదతో పంటల పరిస్థితి ఎలా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు.



కిన్నెరసాని వాగులోకి చొచ్చుకువచ్చిన గోదావరి వరద

క్లుప్తంగా

పాఠశాలల బస్ డ్రైవర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి



సమావేశంలో పాల్గొన్న బస్ డ్రైవర్లు

చింతలపూడి: భగత్‌సింగ్ స్కూల్ అండ్ కాలేజ్ బస్ డ్రైవర్స్ యూనియన్ సమావేశం స్థానిక మార్కెట్ కమిటీ ఆవరణలో మంగళవారం జరిగింది. యూనియన్ గౌరవ అధ్యక్షుడిగా నత్తా వెంకటేశ్వర్రావు, అధ్యక్షుడిగా ఎ మధు, కార్యదర్శిగా ఎం రవికుమార్, కోశాధికారిగా పి నాగబాబు, ఉపాధ్యక్షుడిగా బాపనయ్య, సహాయ కార్యదర్శిగా సర్వేశ్వరరావుతో పాటు కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం జరిగిన సమావేశంలో సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ స్కూల్ అండ్ కాలేజ్ బస్ డ్రైవర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు డ్రైవర్లు పాల్గొన్నారు.

గర్భిణులు, వృద్ధుల తరలింపు



గర్భిణిని తరలిస్తున్న దృశ్యం

వేలేరుపాడు: గోదావరి వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో ముంపునకు గురయ్యే అవకాశం ఉన్న ప్రాంతాల్లోని నిండు గర్భిణులను, వృద్ధులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.ఎస్.శర్మిష్ఠ తెలిపారు. మంగళవారం వేలేరుపాడు మండలం రుద్రమకోటకు చెందిన గర్భిణీని వేలేరుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించామన్నారు. అలాగే తమ దగ్గర ఉన్న సమాచారం మేరకు మిగిలిన వారిని కూడా సమీప ఆస్పత్రులలో చేర్పడం జరుగుతుందన్నారు.

9 నుంచి కావూరిలో కంప్యూటర్ శిక్షణ

ఏలూరు (టూటౌన్): ఈనెల 9వ తేదీనుంచి స్థానిక వసంత మహల్ సెంటర్ వెంకట్రామా ప్రెస్ రోడ్డులోని కావూరి ఫౌండేషన్ కార్యాలయంలో కంప్యూటర్ శిక్షణ ప్రారంభిస్తున్నట్లు కార్యాలయ వర్గాలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపాయి. పదో తరగతి ఉత్తీర్ణులైన వారికి టైపు, డీసీఏ, డీటీపీలోనూ, కామర్స్‌తో ఇంటర్ ఉత్తీర్ణులైన వారికి టాలీలోనూ శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఏలూరు నగరం, పరిసర గ్రామాల్లోని 18 నుంచి 35 సంవత్సరాల లోపు యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

వరద బాధితుల నిమిత్తం రూ.5 లక్షల సాయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విజయవాడ పరిసర ప్రాంతాల్లో వరద ప్రభావంతో సర్వస్వం కోల్పోయిన బాధితులకు అండగా నిలిచేందుకు సాయం అందించినట్లు గుప్తా ఫౌండేషన్ వ్యవస్థాపకులు మడుపల్లి మోహన గుప్త తెలిపారు. ఈ మేరకు వరద సహాయక కార్యక్రమాలు విరివిగా నిర్వహిస్తున్న హరే కృష్ణ మూవ్‌మెంట్ ఛారిటబుల్ ట్రస్ట్ సేవలకు సంతృప్తి చెంది ఆ ట్రస్ట్‌కు తమ ఫౌండేషన్ ద్వారా రూ. 5 లక్షల ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కును మంగళవారం అందజేశారు. స్థానిక గుప్త ఫౌండేషన్ కార్యాలయంలో మడుపల్లి మల్లీశ్వరి ద్వారా ఈ చెక్కు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఆడిటర్ సుబ్బారావు, మేనేజర్ కే. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ జాతీయ పోటీలకు డిస్నీ ఎంపిక



క్రీడాకారిణి డిస్నీ

కొయ్యలగూడెం: జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు బోడిగూడెం పంచాయతీ బర్కెట్‌నగర్‌కు చెందిన విద్యార్థిని డిస్నీ ఎంపికైనట్లు విద్యార్థిని తండ్రి సొంగా సూర్య, వైఎంసీఏ ఫుట్‌బాల్ కోచ్ జె.నాని కమలాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతపురంలో గత నెల 28వ తేదీ నుంచి 28వ తేదీ వరకు జరిగిన అండర్-13 సబ్ జూనియర్ బాలికల ఎంపిక పోటీలు నిర్వహించగా, ఈ పోటీల్లో డిస్నీ ప్రతిభను గుర్తించి రాష్ట్ర జట్టుకు ఎంపిక చేశారన్నారు. దీంతో ఈనెల 6న మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి సబ్ జూనియర్ ఫుట్‌బాల్ పోటీల్లో డిస్నీ ఆడనున్నట్లు తెలిపారు. తాడేపల్లిగూడెంలోని ఓ ప్రైవేట్ స్కూల్లో డిస్నీ ఏడో తరగతి చదువుతోందని కారు డ్రైవర్ అయిన తండ్రి సూర్య తెలిపారు. ప్రస్తుతం అనంతపురం స్టేడియంలో డిస్నీ శిక్షణ తీసుకుంటోందన్నారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడంపై డిస్నీ ఆనందం వ్యక్తం చేసింది. తన తల్లి సుమ, కోచ్ నాని కమలాకర్ తన భవితను తీర్చిదిద్దడంలో ఎంతగానో కృషి చేశారని తెలిపింది.

డిగ్రీ కళాశాలకు పుస్తకాల బహూకరణ

కామవరపుకోట: ఆడమిల్లి డిగ్రీ కళాశాలకు గ్రామానికి చెందిన పారేపల్లి సతీష్ కుమార్ 40 పుస్తకాలు బహూకరించినట్లు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎం.మల్లేశ్వరరావు తెలిపారు. చారిత్రాత్మక, స్ఫూర్తి, అవగాహన, మోటివేషన్ అండ్ ఇన్‌స్పిరేషన్ కలిగించే పలు అంశాలతో కూడిన పుస్తకాలను అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ జి.శ్రీనివాసరావు, ఎం.ఉషారాణి, కె.ఇందిరాకుమారి, ధారావతు మల్లేష్, పి.ఏడుకొండలు, ఎం.విజయకృష్ణ, ఉమ, సిబ్బంది, వీరమల్ల మధు పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

జంగారెడ్డిగూడెం: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై జబీర్ తెలిపారు. వివరాల ప్రకారం మండలంలోని బాట గంగానమ్మ లేఅవుట్ కాలనీలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పైడిపాక ఆర్అండ్ఆర్ కాలనీకి చెందిన ఆంధ్రు పెద్దరాజును అరెస్టు చేసి అతని వద్ద నుంచి రూ. 2700 విలువ చేసే 18మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు.

నేత్రదానంతో మరొకరికి కంటి వెలుగు



పోలవరం రూరల్: వింజరం పీహెచ్‌సీ వద్ద నేత్రదానంపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్న నేత్ర వైద్యాధికారి ఎన్‌జీఎస్ శ్రీనివాస్



కొయ్యలగూడెం: నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా పీహెచ్‌సీలో నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమం

పోలవరం రూరల్: నేత్రదానం చేయడం వల్ల అంధుల జీవితాల్లో వెలుగు నింపవచ్చునని వైద్యాధికారి ఎన్‌జీఎస్ శ్రీనివాస్ అన్నారు. జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా పోలవరం మండలం ఎల్అండ్‌డీపేట, వింజరం ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల వద్ద నేత్ర వైద్యాధికారి ఎన్‌జీఎస్ శ్రీనివాస్ నేత్రదానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యుక్త వయస్సు నుంచి ఎంత పెద్ద వయస్సు వారైనా నేత్రదానం చేయవచ్చన్నారు. కంటి ఆపరేషన్ చేయించుకున్న వారు కూడా దానం చేయవచ్చన్నారు. నేత్రదానం చేసే వ్యక్తి ముందుగా కుటుంబ సభ్యుల అనుమతితో ప్రమాణపత్రాలు రాసి ఇవ్వాలన్నారు. మరణించిన వెంటనే తెలియజేస్తే కుటుంబ సభ్యుల సమక్షంలోనే కార్నియాలను తీసుకోవడం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో వింజరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మురళీధర్, ఎల్అండ్‌డిపేట పీహెచ్‌సీ వైద్యాధికారి నిఖిల్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కొయ్యలగూడెం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ నేత్రదాన పక్షోత్సవాల అవగాహన సదస్సు కంటి వైద్య చికిత్స నిపుణులు సీహెచ్ చక్రవర్తి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నేత్రదానంపై వక్తృత్వం పోటీలు నిర్వహించి వారికి బహుమతి ప్రదానం చేశారు. ప్రతి సంవత్సరం ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 8 వరకు నేత్రదానంపై ప్రజల్లో చైతన్యం కల్పించే ఉద్దేశంతో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పీహెచ్‌సీ వైద్యాధికారిణి ఎస్తేరు రాణి పేర్కొన్నారు. మూఢనమ్మకం తొలగించుటకు ప్రతి ఒక్కరూ నేత్రదానం చేసి మరో ఇద్దరి జీవితాల్లో వెలుగు జ్యోతిని వెలిగించాలన్నారు. సీహెచ్ నాగమణి, సుభద్ర, కుమారి, రామరాజు, మంగారావు, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

వరద బాధితులకు 5వేల పులిహోర ప్యాకెట్లు

జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి దేవస్థానం నుంచి మంగళవారం విజయవాడ వరద బాధితులకు 5 వేల పులిహోర పొట్లాలను పంపించారు. శ్రీ అన్నవరం సత్యనారాయణ స్వామివారి దేవస్థానం వాహనంలో పులిహోర పొట్లాలను పంపించామని మద్ది ఆలయ ఈవో ఆకుల కొండలరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

కొయ్యలగూడెం: అరిపాటి దిబ్బల వద్ద జూద శిబిరంపై పోలీసులు దాడి చేసి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.7 వేలు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై వి.చంద్రశేఖర్ మంగళవారం తెలిపారు.

లోవోల్టేజీ సమస్య పరిష్కరించాలని వినతి



విద్యుత్ శాఖ అధికారులకు వినతిపత్రం సమర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కొయ్యలగూడెం: బోడిగూడెం పంచాయతీ అంకాలగూడెం గ్రామంలో లోవోల్టేజీ సమస్య పరిష్కరించాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం సబ్‌స్టేషన్ కార్యాలయంలో విద్యుత్ శాఖ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. గ్రామంలో లోవోల్టేజీ సమస్య వలన విద్యుత్ గృహోపకరణాలు పాడైపోతున్నాయన్నారు. ముఖ్యంగా దళితవాడలో ఈ సమస్య ఎక్కువగా ఉందని, 16 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ లోడు సరిపోవటం లేదన్నారు. త్రీఫేజ్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేసి సమస్య పరిష్కరించి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని ఎంపీటీసీ జాన్ డేవిడ్ కింగ్, నాయకులు ఏఈ ఎస్‌వీ రామారావును కోరారు.

చైల్డ్ కేర్ ఇనిస్టిట్యూట్‌ల తనిఖీ

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని రిజిస్టర్ అయిన 5 చైల్డ్ కేర్ ఇనిస్టిట్యూట్‌లను ఐసీడీఎస్ డిస్ట్రిక్ట్ లెవల్ కమిటీ మంగళవారం తనిఖీ చేసింది. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీవో పి.బ్యూలా మాట్లాడుతూ బాలలకు అందిస్తున్న వసతి, సదుపాయాలను పరిశీలించామన్నారు. ప్రతి ఒక్క చైల్డ్ కేర్ ఇనిస్టిట్యూట్ జువైనల్ జస్టీస్ యాక్ట్‌నందు పేర్కొన్న నిబంధనలు పాటించాలన్నారు. అదేవిధంగా ఎవరైనా ఆదరణ, సంరక్షణ అవసరత ఉన్న బాలలకు వసతిగృహాలు నడుపుతున్నట్లయితే జువైనల్ జస్టీస్ యాక్ట్ 2015 సెక్షన్ 41 ప్రకారం రిజిస్ట్రేషన్ ఖచ్చితంగా చేయించుకోవాలన్నారు. డిస్ట్రిక్ట్ లెవల్ ఇన్‌స్పెక్షన్ టీమ్ డిస్ట్రిక్ట్ ప్రొబేషనరీ అధికారి, చైల్డ్ కేర్ ఇనిస్టిట్యూట్ నోడల్ అధికారి జె.దుర్గాప్రసాద్, కోకన్వీనర్ డిస్ట్రిక్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ డాక్టర్. సీహెచ్.సూర్య చక్రవేణి తదితరులు పాల్గొన్నారు.



దీవెన చిల్డ్రన్ హోమ్ వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న ఐసీడీఎస్ డిస్ట్రిక్ట్ లెవెల్ కమిటీ

ధరలు తగ్గించాలని సీపీఐ ఆందోళన

కుక్కునూరు: ధరల తగ్గింపుపై సీపీఐ దేశవ్యాప్త పిలుపులో భాగంగా చేపట్టిన ఆందోళన మంగళవారం కుక్కునూరులో కొనసాగింది. సీపీఐ మండల సమితి ఆధ్వర్యంలో అమరవరం, ఉప్పేరు, మాధవరం, వింజరం సచివాలయాల ఎదుట ఆ పార్టీ నాయకులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి మైసాక్షి వెంకటాచారి మాట్లాడుతూ, నిత్యావసర, పెట్రోల్ ధరలు తగ్గించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సగటు మనిషికి అందుబాటులో ఉండేలా ధరలను తగ్గించాలన్నారు. అంతేకాక రేషన్ వ్యవస్థలో తక్కువ ధరకు సరుకులను లబ్ధిదారులకు పంపిణీ చేయాలన్నారు. అనంతరం సచివాలయాల్లో వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు కురాకుల బాబురావు, మండల కౌన్సిల్ సభ్యులు వర్కా నరిసింహరావు, సోడే రమేష్, కమల్, సంతోష్, సుమంత్ పాల్గొన్నారు.



వింజరం సచివాలయంలో వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు

కొయ్యలగూడెం: అధిక ధరలను అరికట్టాలని సీపీఐ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మంగళవారం దిప్పకాయలపాడు, మంగపతిదేవిపేట గ్రామాల సచివాలయ కార్యాలయాల వద్ద, సీపీఐ నాయకులు ఆందోళన నిర్వహించి సచివాలయాల కార్యదర్శులకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం, నిత్యావసర వస్తువుల ధరలను విపరీతంగా పెంచిందని, పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్, నిత్యవసర సరుకులు అయినటువంటి కిరాణా, కూరగాయల ధరలు కూడా విపరీతంగా పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాలలో గుదే శ్రీను, ఇళ్ల నరసయ్య, తేలే వెంకటేశ్వరరావు, సంసని మంగా, చెక్కిరెడ్డి సోమరాజు, బాజీ, రాఘవులు, తదితరులు పాల్గొన్నారు.

వీవోఏల వేతన బకాయిలు చెల్లించాలి



వెలుగు ఏపీఎంకి వినతిపత్రం అందజేస్తున్న వీవోఏలు

జంగారెడ్డిగూడెం: వీవోఏల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో వీవోఏలు వెలుగు ఏపీఎంకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాషిని మాట్లాడుతూ తిరుమలపురం గ్రామం నందు తొలగించిన ఇద్దరు వీవోఏలను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, వేతన బకాయిలు వెంటనే ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారం కాకపోతే మండల, జిల్లా స్థాయిలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ అధ్యక్షుడు వై.జగదాంబ, ఎల్.శేషారత్నం, కార్యదర్శి రాజమణి, పద్మా, షర్మిల, వరలక్ష్మి, సోమేశ్వరి, రత్నం, శారద, బాధితులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని కార్మికుల వినతి

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలపై జిల్లా అధ్యక్షుడు కూనపాముల విగ్నేష్ ఆధ్వర్యంలో మంగళవారం చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా విగ్నేష్ మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం గ్రేడ్-2 మున్సిపాలిటీ అయినందున జనాభాకు తగిన పారిశుధ్య, పంప్ ఆపరేటర్స్ పోస్టులు భర్తీ చేయాలని, రిటైర్డ్, చనిపోయిన మున్సిపల్ కార్మికుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇచ్చి ఆ కుటుంబాలను ఆదుకోవాలని, మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, అప్కాస్‌లో విధులు నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు సీహెచ్, నాన్ పీహెచ్ కార్మికులు టెక్నికల్ కోర్సులు పూర్తి చేసిన వారిని స్కిల్డ్ వర్కర్స్‌గా గుర్తించి వారికి స్కిల్డ్ వర్కర్స్ వేతనాలు చెల్లించాలని తదితర సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు.

అభివృద్ధికి సమన్వయంతో ముందుకు సాగుతాం

సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే రోషన్‌కుమార్

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం పట్టణ అభివృద్ధికి అందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతామని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. జంగారెడ్డిగూడెం మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో మంగళవారం ఎమ్మెల్యే రోషన్‌కుమార్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం పట్టణాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామని, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తామన్నారు. కాగా మున్సిపాలిటీలో ఉన్న టౌన్ ప్లానింగ్ అధికారి ఎందుకు విధుల్లోకి చేరడం లేదని ఆయన అధికారులను ప్రశ్నించారు. వెంటనే బాధ్యతలు తీసుకోకపోతే వేరొకరిని నియమిస్తామన్నారు. పట్టణంలో పారిశుధ్యం లోపించడంపై పూర్తి విచారణ చేయించి అవసరమైన సిబ్బందిని నియమిస్తామన్నారు. తొలుత ఇన్‌ఛార్జ్ కమిషనర్, మేనేజర్ వెంకటరమణ నుంచి పట్టణంలో నిర్వహిస్తున్న పనులు, పారిశుధ్యం, టౌన్ ప్లానింగ్, పన్నులు తదితర అంశాలపై ఎమ్మెల్యే తెలుసుకున్నారు. అలాగే మున్సిపాలిటీ ఆదాయమెంత, ఏ మార్గాల నుంచి ఆదాయం వస్తుంది, ఖర్చు ఎంత, ఇప్పటి వరకు ఎంత ఖర్చుచేశారు తదితర విషయాలను వెంకటరమణ నుంచి తెలుసుకున్నారు. కాగా రివ్యూ సమావేశం నిర్వహిస్తున్న సమయంలో అత్యవసర ఫోన్ రావడంతో ఆయన మధ్యలోనే సమావేశాన్ని ముగించుకుని వెళ్లారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, వైస్‌చైర్మన్ కంచర్ల వాసవీరత్నం, కౌన్సిలర్‌లు, తహసీల్దార్ కె.స్లీవజోజి, ఎంపీడీవో కేవీ ప్రసాద్, ఇన్‌చార్జి మున్సిపల్ కౌన్సిలర్ కేవీ రమణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయంలో సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోషన్‌కుమార్

దొండ పందిళ్ల సబ్సిడీ బకాయిలు చెల్లించాలి

ద్వారకాతిరుమల: దొండ రైతులకు పందిళ్ల సబ్సిడీ బకాయిలను వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండలంలోని పంగిడిగూడెంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో దొండ పందిళ్ల సబ్సిడీ బకాయిల రైతులు మంగళవారం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు దొండ పందిళ్లను పరిశీలించారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ దొండ పందిళ్ల బకాయిల కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు తెచ్చి దొండ పందిళ్లు వేసిన రైతులకు సబ్సిడీ సొమ్ములు చెల్లించకపోవడంతో ఇప్పటికీ అప్పులకు వడ్డీలు కడుతున్నారని అన్నారు. దొండ పంటకు సైతం వైరస్ తెగుళ్ల సోకడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. నష్టాల్లో, కష్టాల్లో ఉన్న దొండ రైతులకు ఇప్పటికైనా ప్రభుత్వ వెంటనే సబ్సిడీ బకాయిలు చెల్లించి ఆదుకోవాలని కోరారు. కూరగాయలు సాగు చేస్తున్న రైతులకు డ్రిప్ పరికరాలు, మల్చింగ్ షీట్స్, విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, ట్రేలు, స్ప్రేయర్లు, ఎల్లో, గ్రీన్, బ్లూ ట్రాప్స్ సబ్సిడీపై అందించాలని కోరారు. కూరగాయల రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కట్టా భాస్కరరావు, జిల్లా కమిటీ సభ్యులు గుర్రం రాంబాబు, గుర్రం పాపారావు, పాముల శ్రీనివాసరావు, జి.నరసింహారావు, దొండ రైతులు పాల్గొన్నారు.



దొండ పందిళ్లను పరిశీలిస్తున్న ఏపీ రైతు సంఘ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, తదితరులు

ఆశ వర్కర్లకు పని భారం తగ్గించాలి

కుక్కునూరు : ఆశ వర్కర్లకు వేతనాలు పెంచాలని కోరుతూ సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఆశ వర్కర్లు మంగళవారం కుక్కునూరు, అమరవరం పీహెచ్‌సీల ఎదుట ధర్నా నిర్వహించి పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని వైద్యాధికారులకు అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ మాట్లాడుతూ, 2024 ఫిబ్రవరి 9వ తేదీన ప్రభుత్వం ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ప్రతినిధి వర్గంతో జరిపిన చర్చల్లో కుదిరిన ఒప్పందాల జీవోలను, సర్క్యులర్‌ను విడుదల చేయకుండా ఆశలకు తీవ్రమైన ద్రోహం చేస్తుందని విమర్శించారు, సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆశ వర్కర్లకు విడుదల చేయాల్సిన ఒప్పందాల జీవోలను తాత్కాలికంగా నిలుపుదల చేశారన్నారు. ఆ జీవోలను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఇప్పటికే పనిభారంతో అల్లాడుతున్న ఆశ వర్కర్లకు సంబంధం లేని అనేక రిజిస్టర్లు పెట్టించి రికార్డులు వ్రాయించే పని చేయిస్తున్నారని దుయ్యబట్టారు. ఆశ వర్కర్లకు సంబంధంలేని ఎన్ఐఈపీ, ఇతర ఆన్‌లైన్ వర్కులు చేయించడం, వ్యాక్సిన్ క్యారియర్లు తెప్పించడం, అటెండెన్స్ రిజిస్టర్ మెయింటెనెన్స్ చేయించడం వంటి పనులు చేయిస్తున్నారని విమర్శించారు. ఆశలకు ఒక గంట పర్మిషన్, ఒక రోజు సెలవు కావాలన్నా అధికారులు దయ దాక్షిణ్యాలపై ఆధారపడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్లు కారం రాజేశ్వరి, బురం శ్రావణి, రమణ, కుమార్, తులసి, ఆదెమ్మ, పద్మ, అర్ధ నాగమణి, సునీత, కనకదుర్గ, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



అమరవరం పీహెచ్‌సీ వైద్యుడికి వినతిపత్రం అందిస్తున్న ఆశ వర్కర్లు

ఏలూరులో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక చర్యలు చేపట్టామని ఏలూరు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప శివ కిషోర్ అన్నారు. నగరంలో ఇండోర్ స్టేడియం, కలెక్టరేట్, జడ్పీ సెంటర్, ఫైర్‌స్టేషన్, ఓవర్ బ్రిడ్జి సెంటర్, రైల్వే లైన్ ప్రాంతాలలో మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కాలేజీలు విడిచి పెట్టే సమయంలో విద్యార్థులు వెళ్లేందుకు కాలేజీ బస్సులు నిలిపి ఉంచే ప్రదేశాలను పరిశీలన చేసి ట్రాఫిక్ నియంత్రించాలని ఆదేశాలు జారీ చేశారు. ఇండోర్ స్టేడియం ప్రాంతంలో విద్యార్థినులతో ఎస్పీ మాట్లాడుతూ కాలేజీ విడిచిపెట్టిన సమయాల్లో, బస్సులు ఎక్కే సమయాలలో ఏదైనా ఇబ్బందికరమైన పరిస్థితులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఎవరైనా ఆకతాయిలు వేధింపులకు గురి చేస్తే వెంటనే డయల్ 112 డయల్‌కి తెలియజేయాలన్నారు. నేరాలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని విద్యార్థినులకు జిల్లా ఎస్పీ వివరించారు. కార్యక్రమంలో ఏలూరు డీఎస్పీ డి శ్రావణ్‌కుమార్, ఏలూరు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె శ్రీనివాసరావు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.



ఇండోర్ స్టేడియం రోడ్డులో ట్రాఫిక్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ ప్రతాప శివ కిషోర్